**కథ**

# బుగ్గమీద చుక్క!

**పండు వెన్నెల కురుస్తోంది.**

**మల్లెతీగ నుండి పరిమళం ఆ ప్రాంతమంతా పాకుతోంది. హరిచందన చందమామనీ, వెన్నెల వెలుగుల్నీ చూస్తోంది. ఏవేవో జ్ఞాపకాలు ఆమెను అక్కడ నిలవనీయలేదు. ఆ తోటనుండి తన గదికి వెళ్లింది. అపురూపంగా దాచుకున్న ఆ డైరీని అందుకుంది.**

ఆ డైరీ ఏ ఒక్క సంవత్సరానిదో కాదు. అందులో రాసుకున్న విషయాలకు తేదీలుండవు. కొన్ని పేజీలు ఖాళీగా వుంటాయి. మల్లెపువ్వు లాంటి కాగితాల నడుమ రంగురంగుల ఇంక్స్‌తో రాసుకున్న ఆ వాక్యాల నిండా పరిమళాలు- జ్ఞాపకాలు. ఎన్నిసార్లు చదివినా తనివి తీరదు. ఎప్పటికప్పుడు ఆ వాక్యాల వెంట పరుగులు తీసుకుపోవటమే.

బ్యూటీ- అందం- సౌందర్యం!

పదహారులోకి అడుగుపెట్టకముందు నన్ను లోబరుచుకున్న పదాలవి. బ్యూటీ ఇన్ లుక్స్- బుక్స్- థిక్ ఫారెస్ట్స్. నా చూపులు పర్వతాలూ- అగాథాలూ- మైనాదానాల్లోనే కాదు, ఓ మాయా మేలిముసుగు ధరించిన దేవకన్య నాకోసం ఎక్కడో నిరీక్షిస్తుందనే అందమైన కల నన్ను వెంటాడేది. ఎక్కడ సినిమాలూ- బట్టల వ్యామోహమూ- రుచికరమైన ఆహారమూ నా వయసు కుర్రవాళ్లని లోబరుచుకోలేవో- అక్కడ నేను పచ్చ చీర ధరించిన పంటభూముల్లో నా కలల సుందరి కోసం అన్వేషించాను. సెర్చింగ్- సెర్చింగ్- సెర్చింగ్ ఫర్ మై ఫాంటసీస్.

కొత్త జీవితం ఆరంభమైన బిందువక్కడ!

ఒక్కసారిగా నా కళ్లూ- మనసూ- నాడీమండలమంతా ప్రకంపనలకు లోనయింది. నాలో విద్యుత్ ప్రవాహం. నా కలల ప్రతిరూపమా! భగవంతుడు నాకోసం ప్రత్యేకంగా సృష్టించాడా! నా ఎదుట ప్రత్యక్షమైన ఆ సౌందర్యరాశి అందాలన్నీ ఆ బుగ్గమీద చుక్కలో నిక్షిప్తం అయివున్నాయా? ఇట్స్ స్పాట్ ఆఫ్ బ్యూటీ! ఆమె రంగులు పులుముకున్న పికాసో చిత్రం కాదుకదా! నా కలలు నిజమే. ఆమె హరిచందన.

కట్న కానుకలు వద్దు. లాంఛనాలు వద్దు. మేళతాళాలు వద్దు. మంత్రాలు వద్దు. ఇక్కడ నిలబడి బాహువులు చాస్తున్నా, హంసలా వచ్చినా, తుపాన్లా ఢీ కొన్నా సంతోషమే. ఈ ప్రపంచంలో కోహినూర్ వజ్రం ఒకటేనంటారు. హరిచందన అంతే. ఆమె నాకు కావాలి. చందనా! వెల్‌కమ్ టు అవర్ గ్రీన్‌లాండ్.

అగరొత్తుల సువాసనలు, మంచానికి వేలాడుతున్న మల్లెపూల దండలు, చిరుగాలికి వాటి గుసగుసలు, నా చూపంతా అక్కడే. విఖ్యాత చిత్రకారుడెవరో అనుభూతి చెంది, పలవరించి, తపించి దిద్దిన రసరమ్య బిందువుని ఓసారి తాకి శలభంలా మాడిపోయినా పర్వాలేదనిపించే క్షణాలవి. అందుకేనా పెళ్లిలో వధూవరుల బుగ్గల మీద చుక్కలు పెట్టటం. జీవితంలో ఆ ఒక్కరోజు ఆనందించాలనా! పాపిష్టి కళ్ల 'దృష్టి' ముఖమంతా విస్తరించకుండా ఆ చుక్కమీదే కేంద్రీకరించాలనా!

హరిచందన చిత్తరువు గీస్తూ బ్రహ్మదేవుడు అద్భుత రీతిలో తీర్చిదిద్దిన ఆ చుక్క మమ్మల్ని ప్రతిరోజూ నూతన వధూవరుల్ని చేసిన భావన. హరిచందన ఓ దేవత- మల్లెపువ్వు. వెన్నెల్ని వొంపే చందమామ. పసిమిఛాయ, నల్లటి కురులు, ఎర్రటి పెదవులు, సంపెంగ నాసిక, ఆమె ఓ రసరమ్య కావ్యం. ఆ కలే- కాలమూ- భౌతిక జగత్తూ ఇవేమీ పట్టనట్లుగా కాలం పరుగులు తీస్తోంది. ఆమె చేతినందుకుని ఈ ప్రపంచపు అందాలకై అన్వేషణ మొదలుపెట్టాను. కొండలూ- లోయలూ- పచ్చదనం- మంచుకురిసే దృశ్యాలూ- మహత్తరమైన కాంక్ష. అదో అపురూపమైన అనుభవం.

ఆమె చదువుకుంటూ- కొన్ని పదాల దగ్గర ఆగిపోతూ మళ్లీ మళ్లీ ఆ జ్ఞాపకాల్లోకి...

యవ్వనమా- ఇక్కడే నిలిచిపో యుగాలపాటు. ఈ ఆనందం నా స్వంతం చెయ్యి. హరిచందన పాదాల ముందు నన్ను నేను అర్పించుకోనీ. హరిచందనా- మరో జన్మంటూ వుంటే ఈ అందాలను మనిద్దరమే మరలా మరలా జుర్రుకోవాలి. ఎన్ని జన్మలున్నా మనల్నే జంటగా వుండనీయమని ఆ మన్మథుడికి అర్జీ పెట్టుకుందాం. గంగాజలంతో దాహం తీరుతుందేమోగాని నా సౌందర్యదాహం తీరదు. ఈ దాహంతోనే ఈ జీవితమూ- ఎన్నివేల జన్మలైనా అంతం కావల్సిందే!

చందనా- పీడకల!

ప్రపంచంలోని కాలుష్యమంతా ఓ బిందువులోకి చేరినట్లు. చేదు- తీపి కలయికగా రూపాంతరం చెందిన కాస్ప్యూల్ భూగోళమంతా విస్తరిస్తున్నట్లుగా. ఉలిక్కిపడి లేచి కూర్చున్నాను. హరిచందన నిద్రపోతోంది. ఆమె ఎద పొంగులు కవ్విస్తున్నాయి. ముడతలు పడ్డ ఆమె శరీరపు రేఖల మీద సుతారంగా మీటాలనే కోరికను బలవంతంగా అణచుకుని, నన్ను నిద్రలేపిన ఆ కలను విశ్లేషించుకుంటూ ఆరాటంగా చందన ముఖంలోకి తొంగి చూస్తే- అందమైన ఆ చుక్క నవ్విందా!

హరిచందనకు వేరెవ్వరిదో కాదు. నా 'దృష్టే' తగులుతుందేమో!

రేడియో వాతావరణ హెచ్చరిక. బంగాళాఖాతంలో అల్పపీడనం వాయుగుండంగా మారిందని. అది మరింత ఉధృతమై మెల్లగా కదిలి తుపాన్‌గా మారవచ్చునంట.

ఆకులు కదలవు. ఓ శూన్యం ప్రకృతిని కమ్ముకున్నట్లు- టార్నెడో- సముద్రంలో ఓ 'చుక్క'గా ఆరంభమై మెల్లగా కదులుతూ తీరం తాకబోయే ముందు.

చందన వచ్చి పక్కన కూర్చున్నప్పుడు అనుమానం- చంద్రుడి చుట్టూ వలయంలా ఆ ముఖంలో ఇదేమిటి చుక్క- అస్పష్టంగా. వేలితో రాస్తే ఆ ముఖంలో మార్పు. పరుగున వెళ్లి అద్దం తెచ్చి చూసుకుంటే.. నీళ్లతో ముఖం కడుక్కుంటే తెల్లని 'మచ్చ'లా ఆ చుక్క.

అల్పపీడనం ఆరంభమయిందా చందన జీవితంలో!

రాత్రి ఎంతకూ కరగదు. అద్భుతమైన చిత్రకారుడి సుదీర్ఘ కృషి మీద ఎవరో నలుపురంగు పులిమినట్లు ఈ మచ్చేమిటి? ఏం కానుంది? ముఖమంతా విస్తరించి అందమైన హరిచందనను పండుటాకులా మార్చనుందా?


వాన- వాన- ఆనందాన్నివ్వటం లేదు. కాశ్మీరు నుండి తెచ్చుకున్న అందమైన రగ్గుతో చందనతో కలిసి వెచ్చదనాన్ని పొందాలనిపించటం లేదు. మై హోపీయస్ట్ డేస్ ఆర్ గాన్. రేపటి నుండి ఆ కాలుష్యపు మచ్చమీద యుద్ధం ప్రకటిస్తాను.

ఆమె కళ్లు మూసుకొంది. శరీరమంతా తీవ్రంగా కంపించింది.

అప్రయత్నంగా ఆమె చూపుడువేలు తన బుగ్గని తడిమింది.

★ ★ ★

''డాక్టర్ ఎంత ఖర్చయినా ఫర్వాలేదు. నా చందన



ముఖంలో ఆ మచ్చ వుండకూడదు. అవసరమనుకుంటే విదేశాలు వెళ్తాను. ప్లీజ్ డ్యాక్టర్. నాకు నమ్మకాన్నివ్వండి. చందనకు ఏమీ కాదని చెప్పండి. చందన ముఖంలో మళ్లీ నేను వెన్నెల్ని చూడాలి.''

''మీరు ఆందోళన పడుతున్నారు. వారికి తగ్గుతుంది.''

''నిజంగానా?''

''ఖచ్చితంగా''

''థాంక్యూ డ్యాక్టర్ థాంక్యూ''

ఎన్ని మందులు వాడినా ఆ మచ్చ అలానే వుంది. ఇంకా రంగులు మారుతోంది. అల్లోపతి ఈ మచ్చను తొలగించలేదా? డామ్ విత్ అల్లోపతి- ఐ విల్‌గోటు ఆయుర్వేదం-యస్...

చందనా-

ఇది పిచ్చికాదు. అందమైన చిత్రం మీద మరకలు పడితే మరో చిత్రం వేసుకోవచ్చు. శ్రమా- రంగులే వృధా అవుతాయి. కానీ ఇది మానని చిత్రం. దీన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలి. నన్ను తొలిసారి చూసినప్పుడు అందమంతా ఆ చుక్కలోనే కనిపించింది. కృష్ణుడు నోరు తెరిస్తే భూగోళమంతా కనిపించినట్లు, ఈస్థటిక్ విజనంతా ఆ చుక్కలోనే కనిపించింది. మరి ఇదేమిటి ఈ పక్కన మచ్చ. రెంటినీ సమానంగా తీసుకోగల స్థితప్రజ్ఞత నాలో లేదు. భగవంతుడు ప్రత్యక్షమై రెండు వరాలిస్తున్నా కోరుకో అంటే ఒకటే చెబుతాను. వంద వరాలిచ్చినా ఒకటే కోరుకుంటాను. ఆ మచ్చ తొలగించు ప్రభూ- అదే నా కోరిక.

చందనా-

నువ్వు సౌందర్యానికి ప్రతీకవు మాత్రమే కాదు. ప్రేమకే నువ్వు ప్రతి రూపానివి. నిన్ను సెక్స్‌కి పర్యాయపదంగా నేను చూసుకోవటం లేదు. నాకిప్పుడు నీ శరీరంతో పనిలేదు. ఎప్పుడైతే నీ ముఖంలో మచ్చ తొలగించగలనో ఆ రోజే తిరిగి కొత్త జీవితంలోకి అడుగుపెడదాం. అందాకా నిన్ను కాంక్షారహితంగా ప్రేమిస్తుంటాను.

★ ★ ★

ఎన్ని రకాల మందులు. ఎన్నెన్ని వైద్య విధానాలు, ఎవరేం చెబితే అది వినటం, పరుగులు తీయటం, ఓ ఆశ, ఓ ఆరాటం, డబ్బులు చిల్లపెంకుల్లా చెల్లా చెదురవుతున్నాయి. అయినా లెక్కచేయడు. ఎవరేమన్నా మౌనమే సమాధానం. తలవంచుకుంటాడు. ఎవరి కళ్లలోకి చూడడు. తను ఏ పచ్చటి చేల మధ్య కూర్చుని కలలు కన్నాడో- కవితలు చదివాడో ఆ అయిదెకరాల పొలం అమ్మేసాడు.

''మనిషంటే నీ దృష్టిలో ఏమిటి? ఆడదంటే ఏమిటి? అందమేనా? ఆ మచ్చల వలన ఆ అమ్మాయికి ఎలాంటి ప్రమాదం లేదని చెబుతున్నారు. మరి నీ బాధేమిటి? నీ ముఖం అద్దంలో చూసుకున్నావా? నీ కళ్లకింద ఆ నల్లటి గీతలేమిటి? నీ జుట్టు తెల్లబడిందెందుకు? అప్పుడే నువ్వు నలభై సంవత్సరాల వయసున్నవాడిలా ఎందుకు తయారయ్యావు? ఎందుకా అమ్మాయి శరీరంలోకి మందుల ప్రవాహం. నువ్విక్కడ ఆగిపోతే చాలా బాగుంటుంది ఆలోచించు''

మెత్తగానే చెబుతారు. కొంతమంది కోప్పడతారు. జాలిపడతారు. అసహ్యించుకుంటారు.

-భూమ్మీద నిలిచాడా- ఈడి పెళ్లాం ప్రపంచ అందగత్తె, ఆ బ్యూటీస్పాట్ స్ఫోటకం మచ్చయింది.

నవ్వులు..అన్నీ అలవాటయ్యాయి.

హోమియోపతి- యునాని- చిట్కాలు- సలహాలు-అలసిపోతున్న క్షణాల్లో ఎవరో ఆ స్వామీజీ గురించిన సమాచారం యిచ్చారు.

''స్వామీజీ ఈ మచ్చ మాయం అవుతుందా?''

చిరునవ్వుతో తలూపాడాయన. ఇద్దరూ కలిసి అడవిలోకి వెళ్లారు. స్వామి తనకు కావలసిన మొక్కల కోసం వెతుకుతుంటే, చేతులు కట్టుకు నిలబడ్డాడు. ఎప్పటికో స్వామి కళ్లు వెలిగాయి. ఆశ్రమం చేరుకున్నాక స్వయంగా నూరి ముద్దచేసి ముఖం మీద ఆ మచ్చను కప్పివేస్తున్నట్లుగా రాసి, ఎండిపోయాక ముఖం కడిగితే ఏదో మార్పు- అలా కొన్ని వారాలు, మెల్ల మెల్లగా మచ్చ కరిగి, అదృశ్యం!

ఆమె చివరి పేజీ దగ్గర ఆగింది.

చందనా-

పి.చంద్రశేఖర అజాద్

## మైమరపు

**ఎవరిదీ మైమరపు. కొంతమంది తినడం కోసం బ్రతుకుతారు. మరికొంతమంది బ్రతకడం కోసం తింటారు. అందాలతార ఐశ్వర్యారాయ్‌కి తిండి యావ ఎక్కువట. ఎక్కడికైనా ఫంక్షన్‌కి వెళ్లినప్పుడు తనకిష్టమైన వాటిని ఎంతో అబగా తింటుందట ఆమె. 'నాకిష్టమైనవి దొరికితే అన్నీ మరచిపోతాను. మా ఫ్రెండ్స్ అంతా నన్ను తెగ తిడతారు. నా జిహ్వాచాపల్యాన్ని నేను వదులుకోలేకపోతున్నాను' అంటోంది. ఆఫర్లు లేక తిండి నయించక కొంతమంది హీరోయిన్లు తెగ సతమతమవుతుంటే ఐస్ మాత్రం ఇలా బ్రేవ్‌మంటోంది.**

సాధించాం. మచ్చలేని నీ ముఖంలోని అనంత సౌందర్యాన్ని వీక్షించే సుమధుర అవకాశం నాకు మళ్లీ లభించింది. ఇన్ని రోజులుగా మరిచిపోయినవన్నీ నాకు గుర్తొస్తున్నాయి. చూసావా- తిరిగి ఈరోజు ఆకాశంలో మేఘాలు హడావుడిగా పరిగెత్తుతున్నాయి. చిరుజల్లులే పడతాయో- కుంభవృష్టే పడుతుందో తెలియదుగానీ-కాశ్మీర్ దుప్పట్లో నిన్ను నాలో ఐక్యం చేసుకుంటాను. మనమధ్య ఏ చలీ చొరబడకూడదు.

ప్రపంచంలో ఇంతవరకూ ఏ ప్రేమికులూ అనుభవించని మధురానుభూతిని స్వంతం చేసుకుందాం. అవును. మై ఫాంటసీస్ విత్ బ్యూటీ వరల్డ్ ఆర్ విత్ మీ. అందవిహీనమైనదేదీ ఇక్కడ వుండకూడదు. మనిషికి 'మచ్చ' వికారం. జన్మ జన్మలూ నీ అందాన్ని ఆస్వాదించటానికి నీ అందాన్ని అడ్డుకున్న ఆ మచ్చని జయించాను.

చందనా-

అన్నపానాలూ-పగలూ రేయి మనకనవసరం. అడవుల్లో కొండకోనల్లో మనం విహరిద్దాం. అలుపొస్తే నిద్రపోదాం. మెలకువలో కలిసి నడుద్దాం. లెటజ్ ఎంజాయిట్ టిల్ ది ఎండాఫ్ లైఫ్!

ఆ రాత్రి-

అద్భుతమైన శిల్పి విశిష్ట శైలికి నిదర్శనంలా వుందా గది. జీవితంలో మధురమైన రాత్రి తొలిరేయి కావచ్చునేమో గానీ..ఇది వాళ్ల జీవితంలో మరపురాని రోజు. హరిచందన దేవతలా నడిచి వచ్చింది.

ఆమె చేతినందుకుని కళ్లలోకి చూసి, బుగ్గ మీదున్న అందమైన మచ్చను సుతారంగా తడిమి, అలా గది బయటకు వెళ్లి- చిరుజల్లుల్ని చూసి, మల్లెపూల వాసనలు మత్తెక్కిస్తుంటే-

''ఈ రాత్రి కరిగిపోకూడదు'' అన్నాడు.

ఆమెను ఎత్తుకుని అలా మంచం మీద జారవిడిచాడు.

సంతోషంతో వారి కళ్లు చెమర్చాయి. ఆమె చేతులు చాచింది. ఆమె గుండెలమీద వాలిపోయాడు. ఆ రాత్రి స్తంభించిందా!



అతని కళ్లలో ఎంత తృప్తో-ఎంత గర్వమో! అలిసి నిద్రపోతున్న అతన్ని ముద్దాడింది చందన

'పిచ్చి పిల్లవాడా!'

★ ★ ★

స్వామీజీ ముందు మోకరిల్లింది హరిచందన.

చిరునవ్వుతో చూస్తున్న స్వామి భృకుటి ముడిపడింది.

''మీవారు'' అన్నారాయన సంశయంతో.

''నా ముఖంలోని మచ్చలానే... ఆయనా...'' ఆమె కంఠం మూగబోయింది.

స్వామి మౌనంగా వుండిపోయారు.

''ఇప్పుడు నన్ను చూసుకుంటే నాకు కోపం వస్తుంది. నన్నెందుకిలా పుట్టించాడా భగవంతుడు. నా బుగ్గ మీద 'చుక్క'ని చూసుకుంటే నా జీవితానికేదో మచ్చలా కనిపిస్తోంది'' అందామె గాద్గదికంగా.

''చూడమ్మా. మనిషి అందం కోసం అన్వేషిస్తాడు. ఆస్తుల కోసం కష్టపడతాడు. తీరా అనుభవించే సమయానికి ఆ అదృష్టానికి దూరమవుతాడు. మనం ఏది అందం అనుకుంటామో అది అందవిహీనం అవుతుంది. 'సృష్టి' గొప్పది. అది ఎవరికి అందాన్నిస్తుందో, మేథస్సునిస్తుందో మనం చెప్పలేం. మనం కోరుకున్న రీతిలో మనం పుట్టలేం. సృష్టి ఇంకా మన చేతుల్లోకి రాలేదు. నువ్వు నిమిత్తమాత్రురాలివి.

అమ్మా అది మచ్చ కాదు.

అందమూ కాదు. అది నీ జీవితానికి చెందిన మరువలేని జ్ఞాపకం'' అన్నాడాయన.

''నాకిప్పుడు ప్రశాంతత కావాలి. ఆయన మరణానికి నేను కారణం కాదని నేను నమ్మేంతవరకూ నాకు మనశ్శాంతి లేదు'' అంది హరిచందన.

''జనన మరణాలకు సృష్టిదే ప్రధాన బాధ్యత. ఆ విషయం ముందు ముందు నీకు అర్థమవుతుంది'' అన్నారాయన.

అత్యంత సాధారణ దుస్తుల్లో- ఏ అలంకరణలు లేని హరిచందన స్వామి ముందు మోకరిల్లింది.

ఆమె ముఖంలో నల్లటి చుక్క స్వామికి కనిపిస్తోంది.

ఆమె పక్కన ఆ డైరీ వుంది!